
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
సోమవారం 31 మార్చి 2025





పంచాంగ పఠనం వింటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు

శుభప్రదం..

విశ్వావసు నామసంవత్సరం

- నేతన్నలకు, అన్నదాతలకు మంచి రోజులే
- జిల్లా వ్యాప్తంగా ఉగాది వేడుకలు
- ఉల్లాసంగా పంచాంగ శ్రవణాలు

సిరిసిల్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరం విశ్వావసుకు స్వాగతం పలుకుతూ ఆదివారం రాజన్నసిరిసిల్ల జిల్లావ్యాప్తంగా ఉగాది వేడకలను ఘనంగా జరుపుకున్నారు. మామిడి తోరణాలు, భక్షాలు, పచ్చడి, పిండి వంటలతో ఇళ్లు కళకళలాడాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. జిల్లాలోని దేవా లయాల్లో ఎంతో ఉల్లాసంగా పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో మార్కండేయ, లక్ష్మీవేం కటేశ్వరస్వామి, వాసవి కన్యకాపరమేశ్వరీ, హనుమాన్ దేవాలయాల్లో పంచాంగ శ్రవణాలు జరిగాయి. పలుసం స్థల ఆధ్వర్యంలో కవి సమ్మేళనాలు నిర్వహించారు. సిరిసిల్ల మార్కండేయ దేవస్థానంలో విశ్వావసు నామ సంవత్సరంలో కలిగే ఫలితాలను పంచాంగ శ్రవణం ద్వారా వేద పండితులు వివరించారు. వేద పండితులు కోట లక్ష్మీనర్సయ్య, కోడూరి విజయ్‌భాస్కర్, తేల్ల ప్రవీణ్ శర్మ, పాశికంటి కృష్ణహరి, కోడూరి విద్యాసాగర్ శర్మ రాశిఫలాలను వివరించారు.

విశ్వావసు నామ సంవత్సరంలో మంచి ఫలితాలు ఉంటాయని, వర్షాలు సమృద్ధిగా పడుతాయని సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతారని తెలిపారు. కృష్ణ పక్షంలో సంక్రమణం జరగడం వల్ల సుభిక్ష, క్షేమ, ఆరోగ్యాలు కలుగుతాయని వివరించారు. పంచాంగ శ్రవణంలో పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పద్మ శాలి సంఘం ప్రతినిధులు, పాల్గొన్నారు. సిరిసిల్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపర మేశ్వరి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు రేపాక రాజుశర్మ పంచాంగ శ్రవణం చేశారు. జిల్లాకేంద్రంలోని హనుమాన్, ఇతర దేవాలయాల్లో జరి గిన పంచాంగ శ్రవణాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో పంచాంగ శ్రవణం..

వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యో తి): విశ్వావసు నామ సంత్సరంలో అన్నివర్గాల ప్రజలు అంత శుభమే జరుగుతుందని రాజన్న ఆలయ ప్ర ధాన అర్చకుడు చంద్రగిరి శరత్‌శర్మ తెలిపారు. ఉగాది నూతన సంవత్స రాన్ని పురస్కరించుకుని రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హజరై జ్యోతిప్రజ్వలన చేసి అర్చకులను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాటాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలం దరికి మంచి జరగాలను, అందరికి ఆయురారోగ్యాలు అందించి, పాడిపంటలు, పిల్లపాపలను చల్లంగా చూడా లని దేవుణ్ణి వేడుకున్నట్లు తెలిపారు. అంతకుముందు రాజన్న ఆలయానికి వీచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ రాజన్నప్రసాదాన్ని అందజేశారు.







రాజన్న ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న ప్రధాన అర్చకుడు శరత్‌శర్మ, సిరిసిల్ల మార్కండేయ స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పద్మబ్రాహ్మణులు, పంచాంగ శ్రవణం వింటున్న ప్రజలు



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

రాజన్న ఆలయంలో ఉగాది వేడుకలు

- స్వామి వారికి ప్రత్యేక పూజలు
- వైభవంగా రథోత్సవం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు రాజరాజేశ్వరస్వామి వారితో పాటుగా అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి)



స్వామి వారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

రాజన్న అర్చకులకు ఉగాది పురస్కారాలు



ఉప ప్రధాన అర్చకుడు వెంకన్నను సన్మానిస్తున్న శైలజరామయ్యర్

వేములవాడ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వర్తించే అర్చకులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలను అందించింది. విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం ఆయా దేవాలయాల అర్చకులను రవీంద్రభారతిలో ఆదివారం సన్మానించింది. రాజన్నఆలయం ఉపప్రధాన అర్చకుడు వెంకన్న, వేద పారాయణదారు జగన్మోహన్‌ను దేవదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్ శాలువతో సత్కరించి సన్మానించారు.

వస్త్ర పరిశ్రమలపై కక్షసాధింపును మానుకోవాలి

- విద్యుత్ కనెక్షన్లను పునురుద్ధరించాలి - వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కారణాలతో వస్త్ర పరిశ్రమలపై కక్ష సాధింపు ధోరణిని మానుకుని విద్యుత్‌బకాయిల పేరుతో సెస్ అధికారులు తొలగించిన విద్యుత్ కనెక్షన్‌లను తిరిగి పునరుద్ధరించాలని సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన చేసిన ఐక్య వేదిక సమావేశంలో ఐక్యవేదిక అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పంతం రవి, పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్ మాట్లాడారు. సిరిసిల్లలో రాజకీయ కక్ష సాధింపు ధోరణితో సెస్ పాలకవర్గం నాలుగు రోజుల నుంచి బ్యాక్ బక్ బిల్లింగ్ సాకుతో సుమారు 250 పరిశ్రమల వరకు విద్యుత్ కనెక్షన్లను తొలిగించారని అన్నారు. దీంతో విద్యుత్ కనెక్షన్లను తొలగించడంతో ఉగాది పండుగ పూట కార్మికులకు ఉపాధి లేక రోడ్డున పడ్డారని సెస్ పాలకవర్గం వైఖరి ఏంటో ప్రకటించాలని డిమాండ్ చేశారు. సెస్ పాలకవర్గం వారివారి రాజకీయ కారణాలతో వస్త్ర పరిశ్రమలపై కక్ష సాధింపు ధోరణులకు పాల్పడుతూ నాలుగు రోజుల నుంచి 250 వస్త్ర పరిశ్రలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను తొలగించడం జరిగిందని ఈ పరిశ్రమలపై ఆధారపడి సుమారు రెండువేల మంది కార్మికులకు పండుగపూట ఉపాధి లేక రోడ్నుపడ్డారని అన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా సవరిస్తూ ఇప్పుడిప్పుడే ప్రభుత్వ ఆర్డర్లను ఇస్తోందన్నారు. ఉపాధిని కల్పించే ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో సెస్ పాలకవర్గం అకారణంగా విద్యుత్ కనెక్షన్లను తొలగించడం సరైంది కాదని వాస్తవానికి సెస్ మనుగడకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వ్యాపారంపై ఆధారపడి ఉందనే విషయాన్ని సెస్ పాలకవర్గం మరచి పోయిందన్నారు. రాజకీ య కారణాలతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికే కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల సంఘాల జేఏసీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కారమయ్యే విధంగా చూపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తొలగించిన విద్యుత్ కనెక్షన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సెస్‌ను ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమవేశంలో నాయకులు అంకారపు రవి, గౌడ రాజు, బండారి అశోక్, ఏనుగుల ఎల్లయ్య, దూడం శంకర్, గోవిందు రవి, సామల అశోక్ మండల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడతున్న వసతి పరిశ్రమల అనుబంధ సంఘాల ఐక్య వేదిక నాయకులు

రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డిని స్థానిక మార్కండేయస్వామి ఆలయం లో పద్మశాలి సేవా సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు.

అంతకు ముందు కృష్ణారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని సేవించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేవాంతం, ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు దేవదాస్, సుదర్శన్, సభ్యులు ఆంజనేయులు, భాస్కర్, దేవదాస్, అంబదాస్, విష్ణుమూర్తి, వేణు, దేవదాస్, ప్రకాశ్, కిరణ్‌కుమార్, శ్రీధర్, రవి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

మినీ వంతెన నిర్మించాలి



బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న పూర్ణిమ

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి-దుమాల గ్రామాల మధ్య ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారిపై మినీ బ్రిడ్జీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన బీజేపీ మహిళా మోర్చా మండల శాఖ అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ ఆదివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. కరీంనగర్‌లోని బండి సంజయ్‌కుమార్ కార్యాలయంలో ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని విన్నవించారు. గొల్లపల్లి-దుమాల గ్రామాల నడుమ 1200 ఎకరాల విస్తీర్ణంలోని వ్యవసాయ పొలాలు ఉన్నాయని పేర్కొన్నారు. రహదారి సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దాంతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్‌కుమార్ సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారని పూర్ణిమ పేర్కొన్నారు.

మంత్రి పొన్నం, ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బోయినపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి శాసనసభ్యుడు మేడిపల్లి సత్యంను బోయినపల్లి మండల కాంగ్రెస్ నాయకులు కలసి విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, ఏనుగుల కనకయ్య, సంబ లక్ష్మీరాజం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, బోయినపల్లి మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నాగుల వంశీగౌడ్, చొప్పదండి నియోజకవర్గం సోషల్‌మీడియా ఇన్‌చార్జి శాలివాహన శ్రీనివాస్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కొలుపుల ప్రవీణ్, ద్యావ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవం.. మహారుద్ర చండీ యజ్ఞం

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ప్రజ్ఞాన క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంభూః ఆదిపరబ్రహ్మ జైమహావిభోశ్రీ ఆధ్వర్యంలో మహారుద్ర చండీ యజ్ఞంను నిర్విరామంగా 24 గంటల పాటు జరిపించారు. యజ్ఞ కర్త పరమో త్రిగుణాత్మక సిద్ధ యజ్ఞమును అత్యంత వైభవంగా నిర్వహించారు. పసుపు కుంకుమార్చన, హోమం, కుంకుమాభిషేకం, తదితర కార్యక్రమాలను కన్నుల పండువగా జరిపించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాతో పాటు జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ పట్టణాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఓమౌజయః ప్రజ్ఞాన క్షేత్రం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. భక్తుల నామ స్మరణతో మార్మోగింది. అనంతరం అన్నదానం చేశారు. ఓమౌజయః సేవా కార్యకర్తలు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు చేపట్టారు. ఈ నెల 31న పూర్ణాహుతి, స్వయంభూః ఆదిపరబ్రహ్మ జైమహావిభోశ్రీ ఆధ్యాత్మిక ప్రబోధనలు చేయనున్నారని నిర్వాహకులు తెలిపారు.

కన్నుల పండువగా ఆంజనేయస్వామి శోభాయాత్ర

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆంజనేయస్వామి దీక్షాపరులు స్వామి వారి శోభాయాత్రను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై అంజనీపుత్రుడి చిత్ర పటంతో స్థానిక సాత అంగడి బజారు నుంచి పుర వీధుల గుండా ఊరేగించారు. భక్తిశ్రద్ధలతో ముందుకు సాగారు. దీక్షాపరులు నృత్యాలు చేశారు. మహిళలు మంగళహారతులు సమర్పించారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

కాయ్ రాజా కాయ్

- జోరుగా ఐపీఎల్ బెట్టింగ్
- పల్లెలకు పాకిన మహమ్మారి
- హోటళ్లు... అద్దె ఇళ్లలో బెట్టింగ్‌లు
- ఇతర రాష్ట్రాల నుంచి బుకింగ్‌లు



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఐపీఎల్ క్రికెట్ క్రేజ్ కొనసాగుతోంది. మరో రెండు నెలల పాటు సాగే ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ భూతం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు పాకింది. బంతిబంతికి ఉత్కంఠగా బెట్టింగ్‌లు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఫలానా బ్యాట్స్‌మెన్ సెంచరీ కొడతాడా, బాల్ ఫోర్ పోతుందా.. ఇలా జోరుగా యువత బెట్టింగ్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో కేవలం నగరాలకే పరిమితమైన బెట్టింగ్‌లు ఇంటర్ నెట్ సౌకర్యం గ్రామ గ్రామాన రావడంతో పాటు మొబైల్ ఫోన్‌లు, సోషల్ మీడియాలో ఆసక్తికరంగా ప్రమోషన్లతో అరకొర డబ్బులతో ఈజీగా మనీ సంపాదించవచ్చు అనే ఆశతో యువకులు బెట్టింగ్‌కల్చర్ వైపు మొగ్గు చూపుతున్నారు. పోలీస్ యంత్రాంగం బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరించడం సినీనటి, సెలబ్రిటీలపై కేసులు నమోదు చేయడంతో యువత ఇబ్బంది పడుతున్న తీరు కూడా కనిపిస్తుంది.

ఎల్లలు దాటిన బుకింగ్‌లు...

జిల్లాలో కొందరు స్థానికంగానే బెట్టింగ్‌లు కొనసాగిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్, కర్ణాటక, చెన్నయ్, బెంగుళూరు ముంబయి తదితర నగరాల్లో ఉన్నవారు సైతం జిల్లాలో సంబంధాలు ఏర్పాటు చేసుకొని ఏజెంట్లను నియమించుకొని ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు జరుపుతున్నట్లుగా తెలుస్తోంది. ఇందుకోసం మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలు అద్దె ఇళ్లలో టీవీతో పాటు మద్యం, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌ల ద్వారా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. యువకుల్లో ఆసక్తి రేకెత్తిస్తూ బెట్టింగ్‌లు కట్టడానికి ప్రొత్సహిస్తున్నారు. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌ల్లో ఏ క్రికెటర్ ఎన్ని వికెట్లు తీశారనే వివరాలను అందిస్తూ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. బంతి, ఓవర్, టాస్ వేసిన దగ్గరి నుంచి బెట్టింగ్‌లు నడుస్తున్నాయి.

అప్పుల పాలవుతున్న యువకులు...

బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లతో జిల్లాలో యువకులు, విద్యార్థులు అప్పులపాలై ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌కు అలవాటు పడడం, గేమ్‌ల కోసం లోన్ యాప్‌ల్లో రుణాలు పొందుతున్నారు. జిల్లాలో ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్‌లతో పలువురు లోన్ యాప్ నిర్వాహకుల వేధింపు లకు గురై ఆత్మహత్యలకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయి. అప్పులు పెరిగి వడ్డీలు కట్టలేక రోడ్డున పడ్డ వారు ఉన్నారు.

ఆగని దందా

బెట్టింగ్, గేమింగ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ పై జిల్లా పోలీసులు పటిష్ఠ నిఘా ఉంచినా దందా మాత్రం గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తున్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభం నుంచే పోలీసులు నిఘాను ఉంచినా స్మార్ట్ ఫోన్‌లలో బెట్టింగ్‌లు కొనసాగిస్తున్నారు. బెట్టింగ్‌లకు తోడుగా గంజాయి అమ్మకాలు కూడా పెరుగుతున్నాయి. పోలీసులు యాంటీ డ్రగ్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసి ప్రచారాలు కూడా నిర్వహిస్తున్నారు. జిల్లాలో 2021 లో 22 కేసుల్లో 71 మందిని అరెస్ట్ చేసి 56.36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నా రు. 2022లో 16 కేసుల్లో 51 మందిని అరెస్ట్ చేసి 35 కిలోలు, 2023లో 61 కేసుల్లో 141 మందిని అరెస్ట్ చేసి 74 కిలోలు 2024లో 93 కేసుల్లో 241 మందని అరెస్ట్ చేసి 41 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ నిఘా పెరిగినా బెట్టింగ్‌లు అక్రమ దందాలు మాత్రం కొత్తదారులు తొక్కుతున్నాయి.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



భూమిపూజ చేస్తున్న రెడ్డబోయిన గోపి, వికాస్‌రావు

కోనరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీతోనే గ్రామా ల అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. కోనరావుపేట మండ లం ధర్మారం గ్రామంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో ఐదు లక్షల నిధులు మంజూరు కాగా వారు సీసీ రోడ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ, సురేష్, తిరుపతి, దేవరాజు, జయశ్రీ, రవీందర్, అబిషేక్, మనోజ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో-ద్విచక్రవాహనం ఢీ

● యువకుడు మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంతునిపేట గ్రామశివారులో శనివారం సాయంత్రం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. హన్మంతునిపేట గ్రామానికిచెందిన అజయ్(23) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. గ్రామంలో చిరుతల రామాయణంలో చురుకుగా పాల్గొని తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాదం నెలకొంది.

గల్లంతైన చిన్నారి మృతదేహం లభ్యం

రామగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల శివారులోని ఇటుక బట్టీలో ఒడిశారాష్ట్రానికి చెందిన గెల్లి(2) అనే చిన్నారి మృతదేహం ఆదివారం లభ్యమైంది. శనివారం సాయంత్రం ఎస్ఆర్ఎస్పీ, ఎల్ఎస్‌బి కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి గల్లంతైంది. కెనాల్‌లో నీటి సరఫరాను నిలిపివేసి శనివారం నుంచి గాలింపులు చేపట్టగా ఆదివారం ప్రమాదానికి నీట మునిగిన ప్రాంతం నుంచి 7వందల మీటర్ల దూరంలో చిన్నారి మృతదేహం నీటిపై తేలిందని ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఓదెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం బుద్దె కుమారస్వామి అనే రైతుకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందింది. సాయంత్రం మొక్కజొన్నపంట సమీపంలో గడ్డి మేస్తున్న సమయంలో కిందికు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ ఎద్దుకు తాకడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు మృతితో రూ.50వేల మేరకు ఆర్థికనష్టం వాటిల్లిందని రైతు కుమారస్వామి తెలిపారు. ప్రమాదప్రాంతానికి విద్యుత్ అధికారులు సందర్శించి పరిశీలించారు.

అభ్యంతరకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని పలు వాట్సాప్ గ్రూపుల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టిన రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తనను కించపరిచేవిధంగా బొడ్డుశ్రీధర్ పోస్టులు పెట్టాడని చిన్న లింగపూర్ గ్రామానికి చెందిన భైరినేని రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం నిందితునివద్ద నుంచి మొబైల్‌ఫోన్ స్వాధీన పర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా, వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏఎంసీ కార్యదర్శి, సెక్యూరిటీగార్డుల రిమాండ్

కరీంనగర్ క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో పండ్ల వ్యాపారుల నుంచి 60వేల రూపాయలు లంచం తీసుకుంటూ శనివారం ఏసీబీకి చిక్కిన కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎ పురుషోత్తం, సెక్యూరిటీగార్డు శ్రీనివాస్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఇదరిని అదుపులోకి తీసుకున్న కరీంనగర్ ఏసీబీ పోలీసులు విచారణ అనంతరం ఆదివారం కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో కరీంనగర్ జిల్లా జైలుకు 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందని ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు.

ఈత సరదా.. కారాదు విషాదం..

- వేసవిలో చెరువులు, కాలువల వద్ద పొంచి ఉన్న ప్రమాదాలు
- పిల్లలను జాగ్రత్తగా గమనించాలని నిపుణుల సూచన

జగిత్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఈల కొలనుల్లో, చెరువులు, కుంటల్లో ఈత కొట్టడం చాలా మంది పిల్లలకు సరదాగా ఉంటుంది. కానీ తగు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రధానంగా ఎస్సారెస్పీ కాకతీయ కాలువ, వరద కాలువ అనుబంధ కాలువల్లో పిల్లలు ఈత కొడుతుంటారు. అజాగ్రత్తగా వ్యవహరిస్తే ఈతకు వెళ్లిన వారు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం ఉన్నాయి.



● జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటన

గొల్లపల్లి మండలం రంగదాముని పల్లె రిజర్వాయర్‌లో కొద్ది రోజుల క్రితం ఈతకు వెళ్లి ఎనిమిదో తరగతి బాలుడు నేరెళ్ల నరేష్(12) మృతిచెందాడు. ఒంటిపూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి రిజర్వాయర్‌లోకి ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా నరేష్‌కు ఈత రాకపోవడంతో మరోచోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు. కాసేపటికి అందులో మునిగి మృతిచెందాడు.

● తల్లిదండ్రులూ..తస్మాత్ జాగ్రత్త

ఈత రాని పిల్లలను తల్లిదండ్రులు ఒంటరిగా పంపకూడదు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు తప్పకుండా వెళ్లాలి. ఎంత లోతుకు వెళ్లి ఈత కొట్టాలో ముందే జాగ్రత్తగా చెప్పాలి. పిల్లలు చెరువులు, కుంటలు, కాలువలు, స్విమ్మింగ్‌పూల్స్‌లో ఈత కొడుతున్నంత సేపు పెద్దలు జాగ్రత్తగా గమనించాలి. ఈత నేర్చుకునేటప్పుడు లైఫ్ జాకెట్లు ధరించేలా చూడాలి. నిపుణల పర్యవేక్షణలో ఈతను నేర్పాలి. చెరువుల్లో చేపల కొరకు వేసిన వలలు ఉంటాయి. వాటిల్లో చిక్కుకునే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలి. చెరువుల్లో బురద అధికంగా ఉన్న ప్రాంతాల్లో కాళ్లు పూడుకపోయి పైకి వచ్చే పరిస్థితి ఉండదు. కాలువల్లో నీటి ప్రవాహ వేగం అంచనా వేయకపోతే ప్రమాదాలు చోటుచేసుకుంటాయి.



● ప్రమాదాలు జరిగితే..

చెరువులు, కుంటలు, కాలువల్లో పడి చిక్కుకుపోయిన వారిని బయటకు తీయగానే వెల్లకిలా పడుకోబెట్టాలి. పొట్టపై మెల్లిగా నొక్కి, నీటిని బయటకు తీయాలి. బాధితుడికి శ్వాస ఆడకపోతే తోటి వ్యక్తులు నోటి ద్వారా శ్వాస అందించాలి. గుండె కొట్టుకోకుంటే చాతిపై నొక్కాలి. వీలైనంత త్వరగా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

కుటుంబాన్ని బెదిరించిన వ్యక్తిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇంట్లో చొరబడి ఓకుటుంబాన్ని బెదిరించిన కేసులో గుగు లోతు కుమార్‌నాయక్‌పై గోదావరిఖని టూటౌన్‌పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం కుమార్ నాయక్ మరో పదిమందితో కలసి హనుమాన్‌నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి ఇంట్లో చొరబడి దాడికి యత్నిం చాడు. భాగ్యలక్ష్మి కుమారుడుకి వచ్చిన సింగరేణి టెండర్‌ను వదులు కోవాలని, లేదంటే కుటుంబం మొత్తాన్ని చంపుతానంటూ బెదిరించాడు.

భాగ్యలక్ష్మిపై దుర్భాషలాడుతూ దాడికి యత్నించాడు. కుమార్ నాయక్‌తో తన కుటుంబానికి ప్రాణహాని ఉన్నదని భాగ్యలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఆదివారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు కుమార్ నాయక్‌పై కేసునమోదు చేశారు.

గ్రూపు-1లో మెరిసిన యువత



నక్క శృతిహర్షిత, కన్నం హరిణి, పాలకుర్తి సందీప్

సుభాష్‌నగర్/కరీంనగర్ టౌన్/కరీంనగర్ క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన గ్రూపు-1 ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన యువతీ యువకులు మెరిసారు. జిల్లా కేంద్రానికి చెందిన నక్క శృతిహర్షిత జనరల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు, మల్టీజోన్ స్థాయిలో 6వర్యాంకు సాధించారు. శృతిహర్షిత అలహాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) బీటెక్ పూర్తి చేశారు. సివిల్స్‌కోసం కూడా సిద్ధమవుతున్నారు. తండ్రి బాలయ్య వైద్యఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యుకేటర్ ఆఫీసర్‌గా, తల్లి సరస్వతి కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కలెక్టర్ కావాలనేది తన లక్ష్యమని, ప్రస్తుతం తనకు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని శృతిహర్షిత పేర్కొన్నారు.

కన్నం హరిణికి 55వ ర్యాంకు..

- ఎస్సీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్

కరీంనగర్‌కు చెందిన కన్నం హరిణి 499.5 మార్కులతో జనరల్ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో 55వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. కరీంనగర్ ట్రినిటీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్, ఎన్ఐటీ వరంగల్‌లో ఈఈఈలో చేరి బీటెక్ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. ఐఏఎస్ కావాలనే లక్ష్యం పెట్టుకున్న హరిణి రెండేళ్లు ఉద్యోగం చేసిన తర్వాత రాజీనామా చేసి ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుంటూ సివిల్స్‌కు సిద్ధమవుతున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యారు. గ్రూప్-1 పరీక్ష రాసిన హరిణి రాష్ట్రస్థాయిలో జనరల్ కేటగిరిలో 55వ ర్యాంకు, ఎస్సీ కేటగిరిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. గ్రూప్-1 ఉద్యోగంలో చేరినా ఐఏఎస్ లక్ష్యంగా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతానని చెప్పారు. బోయినపల్లి మండలం అనంతపల్లికి చెందిన హరిణి తల్లిదండ్రులు కళాప్రపూర్ణ జ్యోతి, కన్నం రమేశ్ ఇద్దరూ స్కూల్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటున్నారు. హరిణికి ఒక అక్క, చెల్లె, తమ్ముడు ఉన్నారు. అక్క ఇప్పటికే డాక్టర్‌గా కొనసాగుతుండగా, చెల్లె ఎంబీబీఎస్ చదువుతున్నారు. తమ్ముడు డాక్టర్ లక్ష్యంగా నీట్‌కు ప్రిపేర్ అవుతున్నారు. గ్రూప్-1లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన కన్నం హరిణి, ఆమె తల్లిదండ్రులు కళాప్రపూర్ణ, రమేశ్‌ను బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చిలుక దేవశంకర్, ఉపాధ్యక్షుడు బేజగం రమేశ్, మనుపాటి రాజయ్య, మేకల స్వరూప తదితరులు అభినందించారు.

పాలకుర్తి సందీప్‌కు 80వ ర్యాంకు..

గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన పాలకుర్తి సందీప్ రాష్ట్రస్థాయిలో 80వ ర్యాంకు సాధించారు. సందీప్ తండ్రి కాశయ్య, కరీంనగర్‌లో సీసీఎస్ ఏసీపీగా పని చేస్తున్నారు. తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. కరీంనగర్‌లోని వాణినికేతన్‌లో పదోతరగతి, ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన సందీప్ తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్, హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చేశారు. నాలుగు నెలల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో ఏవోగా విధుల్లో చేరారు. గ్రూప్-1లో 80వ ర్యాంకు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

గ్రూపు-1లో గంభీరావుపేట

ఎస్ఐకి 89 ర్యాంక్



శ్రీకాంత్

గంభీరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) గ్రూపు-1లో గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంక్ సాధించారు. ఎస్సీ కేటగిరీలో మల్టీజోన్ పరిధిలో శ్రీకాంత్ మూడో ర్యాంక్ సాధించారు. ఎస్ఐ శ్రీకాంత్ ఓవైపు తన విధులను నిర్వహిస్తునే గ్రూప్-1 పరీక్షకు సన్నద్ధమై 489 మార్కులు సాధిం చాడు. హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్ తండాకు చెందిన శ్రీకాంత్‌ది ముందు నుంచి వ్యవసాయ కుటుంబమే.

పోతారంలో 10వ తరగతి వరకు, బాసర ట్రిబుల్ ఐటీలో బీటెక్ చేశారు. వీఆర్‌వోగా, పంచాయితీ కార్యదర్శిగా కొలువులు సాధించి, కొంతకాలం సిద్దిపేట జిల్లాలో విధులు నిర్వహించాడు. 2020లో ఎస్ఐ ఉద్యోగం సాధించి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బొయినపల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం గంభీరావుపేట ఠాణాలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ మొక్కవోని దీక్షతో చదివి గ్రూప్-1 రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంక్ సాధించాడు.

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి

● అస్తవ్యస్తంగా విస్తరణ పనులు ● కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు



మానకొండూర్‌లో ప్రమాదకరంగా ప్రయాణం



మానకొండూర్‌లో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



తాడికల్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన ప్యాసింజర్ ఆటో(ఫైల్)

మానకొండూర్/శంకరపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి వరంగల్ వరకు నిర్మిస్తున్న 563 జాతీయ రహదారి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో 20 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారు నుంచి వెల్లుతున్న ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వపై నిర్మించిన ఇరుకు వంతెన కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చెంజర్ల బస్టాండ్ వద్ద ఫైఓవర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో నుంచి వెల్లుతున్న ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వపై నిర్మించి ఇరుకు వంతెన ప్రమాదాలకు నిలయంగామారింది. శంకరపట్నం మండలంలో ఎన్‌హెచ్-563కొత్తగట్టు శివారులో ప్రారంభమై తాడికల్‌శివారుతో ముగుస్తుంది. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలకు గురై పలువురు మృతిచెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. ఓవైపు జాతీయరహదారి విస్తరణ పనులు నడుస్తున్నాయి. ఈ పనులు అస్తవ్యస్తంగా ఉండడం, పనులు జరిగేచోట సరైన సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేషనల్‌హైవే అథారిటీ అధికారులు ఏ విధమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడం లేదనే విమర్శలు వినిపి స్తున్నాయి. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటిని ప్రమాద జోన్లుగా నిర్ధారించి కాషన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరతున్నారు.

● ఇటీవల జరిగిన ప్రమాదాలు

⇨ శంకరపట్నం మండలం మక్తకు చెందిన షేక్‌అజీమ్ (35), అతని కుమారుడు అబ్దుల్ రహ్మాన్ (10)లు మోటర్ సైకిల్‌పై కేశవపట్నం నుంచి మక్తకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కేశవపట్నం బస్టాండ్ సమీపంలో వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ బైక్‌ను ఎదురుగా ఢీ కొట్టడంతో తండ్రి, కొడుకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు రోడ్డు పక్కన బైక్‌పై వెళ్తున్న మాందాడి శ్రీనివాస్‌రెడ్డికి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

⇨ శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన దండు కొంరయ్య తన స్వగ్రామం నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నాడు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై మొలంగూర్ పెట్రోల్ బంకు ఎదురుగా డేనియల్ అనేవ్యక్తి కొంరయ్య బైకును వెనుకనుంచి ఢీ కొట్టాడు. దీంతో కొంరయ్య తలకు, కుడి కాలుకు గాయాలు కాగా, డేనియల్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

⇨ హనుమకొండకుచెందిన గుడిపాటి భూపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి-రమాదేవి, సునీత, మానస, సుజాత, అయాన్ష్‌తో కలిసి కారులో కరీంనగర్‌లో ఓ వివాహానికి హాజరై తిరిగి హనుమకొండకు వెళ్తున్నారు. ఈక్రమంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్, వంకాయ గూడెం గ్రామాల మధ్య కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను, ప్యాసింజర్ ఆటోను, ట్రాలీ ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇన్నోవా ప్యాసింజర్ ఆటోను బలంగా ఢీ కొట్టడంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటో డ్రైవర్ మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

⇨ హుజూరాబాద్ మండలం రాజపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ హైమద్ తన వ్యక్తిగత అవసరాల రీత్యా కేశవపట్నం వచ్చి తన స్వగ్రామం రాజపల్లికి వెళ్తుండగా మార్గ మధ్యలో కొత్తగట్టు వద్ద బైక్ అదుపు తప్పి ఒకసారిగా కింద పడడంతో తలకు, మోకాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి.

⇨ శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ముద్దమల్ల హరీస్ (23) లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు.

⇨ శంకరపట్నం మండలం తాడికల్ శివారులో ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

⇨ శంకరపట్నం మండలం తాడికల్ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి.

⇨ తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన 8మంది ట్రాలీ ఆటోలో వేములవాడ దైవ దర్శనానికి బయలుదేరారు. ఈ క్రమంలో వంకాయగూడెం వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీ ఆటో ట్రాలీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న ఆనంద్‌వర్ధన్, సూర్యప్రకాష్, ఇషాని ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు.

⇨ శంకరపట్నం మండలంలోని మక్త గ్రామానికి చెందిన పంచకోటి గోపి (30) బైక్‌పైన వంకాయగూడెం గ్రామ శివారులోని ఓ హోటల్‌కు వెళ్లి సర్వపిండి తీసుకొని బైక్‌పై తన హార్వేస్టర్ రిపేర్ షాపు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా హుజూరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీ కొట్టడంతో గోపి తలకు తీవ్రమైన గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎప్పటికి పూర్తయ్యేనో..?

- అసంపూర్తిగా అదనపు తరగతి గదులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తి కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేటు స్థాయిలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టినా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో శిథిలమైన తరగతి గదుల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది.



నిలిచిపోయిన తరగతి గదుల భవన నిర్మాణం

● నిలిచిన నిర్మాణాలు..

మండలంలోని రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, సింగారం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకం కింద ఎంపిక చేసి అభివృద్ధి పనులకు రూ.కోటి 57 లక్షల నిధులను కేటాయించింది. రెండేళ్ల కిందట పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. పాత భవనాలను తొలగించి అదే స్థలంలో పనులను చేపట్టారు. అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, సింగారం గ్రామాల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. మంజూరైన నిధుల్లో రూ.61 లక్షలు చెల్లించగా, మిగతా రూ.21లక్షలు చెల్లించాల్సి ఉంది. రాచర్లబొప్పాపూర్‌లో రూ.49.96, నారాయణపూర్‌లో రూ.26 లక్షలు కలిపి మొత్తం రూ.75.96లక్షలు చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు అర్ధంతరంగా పనులను నిలిపివేశారు.

● నిర్మాణాలు నిలిచిపోయాయి.

బిల్లులు రాకపోవడంతో పనులను నిలిపివేశారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం పేరిట అదనపు తరగతి గదుల నిర్మాణాలను చేపట్టింది. గత ప్రభుత్వంలో చేపట్టిన తరగతి గదుల నిర్మాణాలకు బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదు. రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 445 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒకే గదిలో ల్యాబ్, గ్రంథాలయం, డెస్కులు ఉండగా, తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. ఇరుకు గదిలో పాఠాలు వినేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడం వల్ల పందులు, కుక్కలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయోగాలు చేయలేకపోతున్నాం..

- అల్లె ప్రణతి, 9వ తరగతి విద్యార్థిని, రాచర్లబొప్పాపూర్



పాఠశాలలో పాత తరగతి గదులను తొలగించి నిర్మాణ పనులను చేపట్టారు. యేడాది దాటినా పనులు పూర్తి కాలేవు. గదులు లేక ల్యాబ్ మూలకు పడింది. ప్రయోగాలు చేయలేకపోతున్నాం. అధికారులు స్పందించి తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

- కృష్ణహరి, ఎంఈవో



గత ప్రభుత్వం 'మన ఊరు- మన బడి' కింద రెండేళ్ల తరగతి గదులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించింది. రాచర్లబొప్పా పూర్, నారాయణపూర్ గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయేలా చర్యలు చేపడుతాం.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

● ముగ్గురి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆటో, ద్విచక్రవాహనం ఆదివారం రాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మండలంలోని నారాయణపూర్, హరిదాస్‌నగర్ గ్రామాలకు చెందిన యువకులు హఫీజ్, అఫ్రోజ్, రఘుపతితో పాటు మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. రంజాన్ పండుగ సందర్భంగా నూతన దుస్తులు కొనుగోలు చేసేందుకు హఫీజ్, అఫ్రోజ్‌లు కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వైపునకు వెళుతున్నారు. రఘుపతితో పాటు మరో ముగ్గురు ఆటోలో సిరిసిల్ల నుంచి హరిదాస్‌నగర్‌కు వస్తున్న క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి.

దీంతో హఫీజ్, అఫ్రోజ్, రఘుపతి పరిస్థితి విషమంగా ఉంది. హఫీజ్, అఫ్రోజ్‌ను ఎల్లారెడ్డిపేటకు, రఘుపతితో పాటు మరో ఇద్దరిని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రహదారిపై ఉన్న వాహనాలను తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాలప్రకారం కేసన్నపల్లె గ్రామానికి చెందిన వడిజె అఖిల్ ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవన్యూ శాఖ అధికారులు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా ఉగాది వేడుకలు

● ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు



ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గుపూజారులు

ఓదెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వస్తిశ్రీ విశ్వావసునామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు, పారాయణాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున వచ్చిన వాహనాలకు పూజలు నిర్వహించారు. గతంలో నిర్వహించిన ఎడ్లబండ్ల ప్రదక్షిణలు కనబడలేదు. వాటి స్థానంలో వాహనాలకే రథాలను తయారుచేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. హరిపురం గ్రామానికి చెందిన యాదవ భక్తులు మేకల బండ్లతో ప్రత్యేక ప్రదక్షిణలు నిర్వహించారు. జమ్మికుంట, సుల్తానాబాద్, మంచిర్యాల, మందమర్రితో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులను సమర్పించారు. అలాగే పొత్కపల్లిలో రాజగోపాలస్వామి, భవాని సహిత మహా లింగేశ్వర స్వామి, మడకలో ఉమామహేశ్వర స్వామి, కనగర్తిలో శివాలయం, ఆంజనేయస్వామి, కొలనూర్ లో మల్లన్న గుట్ట వద్ద ఉగాది వేడుకలు, వాహనాల పూజలు నిర్వహించారు. అనంతరం మల్లన్న జాతరతోపాటు ఓదెల సీతారామచంద్రస్వామి, శివాలయం అలాగే గుంపుల రామభద్ర ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు భక్తి శ్రద్ధలతో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఇళ్ళ ముంగిట మహిళలు రంగవల్లులతో వాకిళ్లను అలంకరించి, పచ్చని తోరణాలతో ఉగాది వైభవాన్ని చాటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఏఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో పొత్కపల్లి పోలీస్ సిబ్బంది బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఉగాది వేడుకలకు దాదాపు 15 వేల మంది భక్తులు హాజరయ్యారు.



ఓదెల ఆలయంలో మేకలబండ్లతో భక్తుల ప్రదక్షిణలు

- టాటా వారి సహకారంతో
- ఏటీసీ సెంటర్ ఏర్పాటు
- 60వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన
- పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ



పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల

నూతన కోర్సులతో ఐటీఐకి పూర్వ వైభవం



ప్రభుత్వ ఏటీసీ సెంటర్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం గత వైభవాన్ని సంతరించుకుంటోంది. 59 ఏళ్లు పూర్తిచేసుకుని 60వ యేట అడుగుపెడుతున్న ఈ ఐటీఐ ఉత్తర తెలంగాణకు ఒక ఎంప్లాయిమెంట్ కేంద్రంగా కీర్తి గడిచింది. కోల్‌బెల్ట్, ఎన్టీపీసీ, నాటి ఎఫ్‌సీఐ ఎరువుల కర్మాగారానికి, రామగుండం థర్మల్ పవర్‌స్టేషన్‌లకు టెక్నికల్ ఉద్యోగులను అందించింది.

1964లో పెద్దపల్లిలో ప్రారంభమైన ఈ ఐటీఐకి టెక్నికల్ విద్యనభ్యసించే వారికి ఒక వరం ఉండేది. మొదట ఫిట్టర్, టర్నల్, మిషినిస్ట్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆర్ అండ్ టీవీలకే పరిమితమైంది. ప్రస్తుతం ఈ ఐటీఐ అధునాతన కోర్సులకు స్వాగతం పలికింది. 20 ఎకరాల రెండు గుంటల్లో ఐటీఐ విస్తరించి ఉంది. ఇందులోనే జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం కూడా ఉంది. గతంలో కలెక్టరేట్ ఉంటే దానిని సొంత భవనంలోకి మార్చారు.

● 646 మంది విద్యార్థులు

ఐటీఐలో ఎలక్ట్రిషన్ ఐదు యూనిట్లు, ఫిట్టర్ ట్రేడ్ రెండు యూనిట్లు, టర్నర్, మిషన్ ట్రేడ్, మోటార్ మెకానిక్ ట్రేడ్, వెల్డర్, కోపా, ఎలక్ట్రానిక్, డిజిల్ మెకానిక్ ట్రేడ్ రెండు యూనిట్ల చొప్పున నడుస్తున్నాయి. ఒక్కొక్క యూనిట్లో 20 నుంచి 22 మంది విద్యార్థులు ఉంటారు. విశాలమైన ప్రాక్టికల్ రూములు డ్రిల్ మిషన్స్ లేత్ మిషన్స్, గ్రైండింగ్ మిషన్స్ తదితర మిషన్‌లు అందుబాటులో ఉన్నాయి.

ఏటీసీ సెంటర్లో కొత్త కోర్సులు

పెద్దపల్లి ఐటీఐలో కొత్తగా నిర్మాణం చేసిన ఏటీసీ సెంటర్లో కొత్త కోర్సులు వచ్చాయి. అడ్వాన్స్‌డ్ సీఎస్‌సీ, అడ్వాన్స్‌డ్ టూల్ యూసింగ్ తోపాటు బేసిక్ డిజైనర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్స్ మొదలగు కొత్త కోర్సులు వచ్చినట్టు పేర్కొన్నారు.



తరగతి గదిలో విద్యార్థులు

● ఏటీసీ సెంటర్ నిర్మాణం

టాటా కంపెనీ వారు రూ.475 కోట్ల ఎస్టిమేషన్‌తో ఇక్కడ ఏటీసీ (అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్) నిర్మాణంతోపాటు దాన్ని నడిపించడానికి సిబ్బందిని నియమించారు. దీనిలో భాగంగా రూ.4.5 కోట్లతో ఏటీసీ భవన నిర్మాణం జరిగి రూ.33.5 కోట్లతో మిషన్ల ఏర్పాటు చేస్తున్నారు. దీనితోపాటు ముగ్గురు మాస్టర్లను కంపెనీ నియమించింది. ఏటీసీ సెంటర్‌కు 85 శాతం పెట్టుబడి టాటా కాగా, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.14 లక్షలు కలెక్టర్ కేటాయించారు. ఏటీసీ సెంటర్‌లో ఆరు ట్రేడ్‌లు మూడు యూనిట్లను ఏర్పాటుచేశారు. రెండు సంవత్సరాల కోర్సులు ఒక సంవత్సరం కోర్సు కూడా ఉంది. అలాగే కలెక్టర్ కోయ శ్రీహర్ష ఐదు లక్షలు రా మెటీరియల్ సమకూర్చడంతోపాటు డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు.

● జిల్లాలో ఆరు ప్రైవేటు ఐటీఐలు వెయ్యి మంది విద్యార్థులు

జిల్లాలో రెండు ప్రభుత్వ ఐటీఐలతోపాటు ఆరు ప్రయివేటు ఐటీఐలు కూడా నడుస్తు న్నాయి. పెద్దపల్లిలో సింధూర, కాకతీయ, శివ సాయి ఐటీఐలు ఉండగా, గోదావరిఖని ప్రాంతంలో గౌతమి, శివశక్తి, సారథి ఐటీఐ ఉన్నాయి. వీటిలో సంవత్సరానికి వెయ్యి మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

● అభివృద్ధి.. సమస్యలు

పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో యేటా అప్రెంటీస్‌షిప్ నిర్వహిస్తున్నామని, ప్రతీసారి 200 మందికి అప్రెంటీస్‌షిప్ అందించి జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మధ్యనే 100 మందికి జాబ్ మేళాలో జాబ్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. రెండు వైపులా గేట్ల నిర్మాణం చేపట్టి వాకింగ్ ట్రాక్‌తో మైదానం కళకళ లాడుతుందన్నారు. కాంపౌండ్ వాళ్ళ ఒకచోట కూలిందని దాని నిర్మాణం తో పాటు రూ.14 లక్షల విద్యుత్ బకాయిలను చెల్లించాల్సి ఉందని అన్నారు.

● నూతన ట్రేడ్‌లకు అనుగుణంగా స్టాఫ్‌ను పెంచాలి

నూతన ఏటీసీ సెంటర్‌లో ఉన్న కొత్త ట్రేడ్లకు అనుగుణంగా స్టాఫ్‌ను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న స్టాఫ్ 50 ఏళ్ళ పైబడిన వారే ఉన్నారు. వారిలో కొందరు సీటీఐ చేసిన వారు, మరి కొందరు డిప్లమా, కొంత అవుట్ సోర్సింగ్ ద్వారా వచ్చిన వారు ఉన్నారు. ఏటీసీ సెంటర్‌లో వచ్చిన కొత్త కోర్సులకు అనుగుణంగా బీటెక్, ఏటీఐ, సీటీఐ నుంచి టెక్నికల్ స్టాఫ్ వస్తేనే న్యాయం జరుగుతుంది.

ఐటీఐ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- వెంకటరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ , పెద్దపల్లి



పెద్దపల్లి ఐటీఐలో అందిస్తున్న కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న నూతన కోర్సులపై అవగాహన పెంచుకొని కోర్సుల్లో చేరి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి.

వేములవాడలో ఘనంగా ఉగాది వేడుకలు

● స్వామి వారికి ప్రత్యేక పూజలు ● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



వేములవాడలో కన్నుల పండువగా స్వామివారి రథోత్సవం



శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు రాజరాజేశ్వరస్వామి వారితో పాటుగా అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేక పూజలు చేశారు. నూతన పంచాంగ పుస్తకాలను స్వామి వారి చెంతవుంచి పూజలు నిర్వహించారు. రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయ పరిసరాలను పూలతో అందంగా అలంకరించారు.

● భక్తుల రద్దీ..

ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు లక్ష్మీగణపతి, రాజన్నను, పార్వతిదేవి అమ్మవారిని దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో అనంతపద్మనాభస్వామి, సీతరామచంద్రస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు.

● వైభవంగా స్వామివారి రథోత్సవం..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను అంబారి సేవపై పట్టణ వీధులగుండా ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు అంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి చందనలంకారం, అభిషేకాలను ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. ఆలయ అధికారులు దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. వెంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు.

ఆదివరాహస్వామి సన్నిధిలో..

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఆదివరహస్వామి సన్నిధిలో ఆదివారం ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి పూజలు చేశారు. వాహనదారులు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఆచార్యులు కలకుంట్ల వరప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. కమాన్‌పూర్ పిరమిడ్ స్వచ్ఛంద సంస్థవారు భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా టూటౌన్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐలు కె.ప్రసాదరావు, రవళి, ఏఎస్ఐ బాలజీ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, ఆర్జీ 2 జీఎం సుధాకర్‌రావు, యూట్యూబర్ వర్షిని, ముత్యాల దామోదర్, ఇనుగంటి రామారావు, కిషన్‌రెడ్డి తదితరులు ఉగాది ఉత్సవాలలో పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల పూజలు..

ధర్మపురి: లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ దేవాలయాల్లో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచియే పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతిధ్వనించాయి. రాత్రి వరకు భక్తులతో ఆలయాల్లో రద్దీ నెలకొంది.



కమాన్‌పూర్: ఆదివరాహస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, కొండగట్టులో ఘనంగా పంచాంగ శ్రవణం



కొండగట్టులో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి దేవాలయం ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను శేషప్ప కళా వేదికపై తీసుకువచ్చారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేకపూజలు జరిపారు. ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్య పండితులు బుగ్గారపు రాజేంద్రప్రసాద్‌శర్మ నూతన శ్రీ విశ్వావసునామ సంవత్సర పంచాంగం పఠించారు. ఏడాదిలో రాశులకు సంబంధించిన ఆదాయ, ధన, వ్యయ, అధికారం, రాజయోగంతోపాటు ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, పంటలు, ఫలాల గురించి వివరించారు. జ్యోతిష్యపండితులు బుగ్గారపు రాజేంద్రప్రసాద్‌శర్మను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు ఒజ్జల సౌజన్య, బాదినేని వెంకటేష్, రాపర్తి సాయికుమార్, గుడ్ల రవీందర్, నేదునూరి శ్రీధర్, బొల్లారపు పోచయ్య, స్తంభంకాడి గణేష్, మందుల మల్లేష్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్ పంచాంగశ్రవణం చేయగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నివేదన కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్ రావు, ప్రధానర్చకులు రామకృష్ణ, రఘు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఆలయఅర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం కొండపైన రూ.35 లక్షలతో చేపడుతున్న జీవి షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యం భూమి పూజ చేశారు.



ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలయ చైర్మన్, ఆలయ ఈవో, ప్రముఖులు, భక్తులు

తాగునీటి కోసం పోచమ్మతండా వాసుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మతండా గిరిజన మహిళలు ఆదివారం తాగునీటి కోసం ఆందోళన చేశారు. తండాలో 16 కుటుంబాలు జీవిస్తున్నాయని, తాగేందుకు నీటికి తల్లాడిల్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చుక్కనీరు లేక పండుగ పూట పనులు చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. పదిహేను రోజులనుంచి తండాలో తాగునీటికి ఇబ్బం దులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలను ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.



బిందెలు, డ్రమ్ములు, బకెట్లతో ఆందోళన చేస్తున్న మహిళలు

బీర్‌పూర్‌లో ఎడ్లబండ్ల పోటీలు

బీర్‌పూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఎడ్లబండ్ల పోటీలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, సారంగాపూర్ మాజీసర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి, గోణె రమణ రావ్, మాజీ ఉపసర్పంచ్ హరీష్, కృష్ణరావ్, నేరెల్ల సుమన్, శ్రీనివాస్, రాజేశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

పంటలను కాపాడాలని అంజన్నకు ముడుపు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సాగుచేసిన పంటలను కాపాడాలని వేడుకుంటూ ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో రైతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు వేణుగోపాలచారి ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. వడగళ్ల వానలు కురవకుండా పంటలను రక్షించాలని ముడుపు వేశారు. ప్రతి యేటా ఉగాది పండుగ రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు వేయడం అనాదిగా వస్తున్న ఆచారమని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హన్మండ్లు, మాజీ సర్పంచులు నర్సయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు మల్లారెడ్డి, నర్సయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న రైతులు

ఊరూరా ఉగాది వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పంచాంగ శ్రవణం చేసిన పండితులు
- ఆసక్తిగా తిలకించిన ప్రజలు


పెద్దలింగాపూర్ గ్రామంలో పంచాంగ శ్రవణం


రుద్రంగిలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న గ్రామస్థులు


కోనరావుపేటలో..

జిల్లా వ్యాప్తంగా ఉగాది వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. విశ్వావసు నామ సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ప్రజలు ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరంలో పంట పొలాలు పచ్చగా ఉండాలని, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని వేడుకున్నారు. ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ప్రజలు ఆసక్తిగి తిలకించారు.

ఇల్లంతకుంట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు గాలిపల్లి, పెద్దలింగాపూర్, అనంతగిరి, వల్లంపట్ల, కందికట్కూర్ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు చేశారు. ఇల్లంతకుంటలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్, జిల్లా సేవాప్రముఖ్ మొగిలి శ్రీనివాస్, ఖండ కార్యవాహ తాటిపెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట, అల్మాస్‌పూర్, అక్కపల్లి, దుమాల, పదిర, రాగట్లపల్లి, బండలింగంపల్లి, నారాయణపూర్, కోరుట్లపేట, తదితర గ్రామాల్లో పంచాంగ శ్రవణాన్ని రాజకీయ నాయకులు, రైతులు, ప్రజలు, ఆసక్తిగా తిలకించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, తహసీల్దార్ సుజజసాత, ఎంపీడీవో సత్తయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్ మండల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని రామాలయంలో వేద పండితులు, గ్రామ పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు. పంట పొలాలు పచ్చగా ఉండాలని పిల్ల పాపలు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని, గ్రామం శుభిక్షంగా ఉండాలని రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ప్రదర్శన చేశారు. దోసలగూడెం కాలనీలోని హన్‌మాన్ ఆలయంలో ఉగాది పండగ సంధర్బంగా ప్రత్యేక పూజలు చేశారు..

● గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాథ వద్ధాశ్రమంలో ఆశ్రమ నిర్వాకులు నర్సాగౌడ్ వద్ధులకు ఉగాది పచ్చడిని అందజేశారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ దేవాలయంలో జరిగిన వేడుకల్లో పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపల్లి ఆనందం, నాయకులు మచ్చ ఆంజనేయులు, మోర శ్రీహరి, మచ్చ శ్రీనివాస్, కొడం రమేష్, సామల రమేష్, భీమనాతిని అశోక్, దేవేందర్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చకులు భక్తుల సమక్షంలో పంచాంగ శ్రవణం చేశారు.

రుద్రంగి: మండలంలోని మార్కండేయస్వామి, ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి, శంభులింగేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రుద్రంగిలోని మార్కండేయస్వామి ఆలయంలో భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణి చేశారు.

కోనరావుపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం చేశారు. భక్తులు పాల్గొన్నారు,

చందుర్తి: మండల కేంద్రంలోని మహాలక్ష్మి అలయంలో అర్చకులు అయాచితుల పవన్ శర్మ పంచాగ శ్రవణం గావించారు.

వేములవాడ టౌన్: మండలంలోని అగ్రహారం హనుమాన్ ఆలయంలో ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులను సన్మానించారు.

అనుపురం గ్రామంలో వేదపండితులు పంచాంగం చదివి వినిపించారు. కార్యక్రమంలో రామాచారి, గ్రామస్థులు ఎర్రం మహేష్, మ్యాకల రవి, ఎర్రం రాజు, శీలం జనార్దన్‌రెడ్డి, వెంకటరమణరావు, ప్రభాకర్‌రెడ్డి, ఆగయ్య, సత్తయ్య, పోరెడ్డి నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గంభీరావుపేటలో ఎండ్ల బండ్ల ప్రదర్శన


చందుర్తిలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న గ్రామస్థులు


తంగళ్లపల్లిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు

పింఛన్.. ఇప్పించరూ..

- దివ్యాంగ ధ్రువీకరణ పత్రం ఉన్నా.. 'ఆసరా'కు దూరం


తల్లిదండ్రులతో యశ్వంత్

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొడుకు జన్మించాడన్న సంతోషాన్ని విధి ఆ నిరుపేద దంపతులను ఊపిరి సలుపకుండా చేసింది. రంగుల ప్రపంచాన్ని చూడాల్సిన ఆ బాలుడుకి పుట్టికతోనే కంటి చూపు లేకుండా పోయింది. దివ్యాంగుగ్గైన తమ ఆరేళ్ల వయసు ఉన్న కొడుకు యశ్వంత్‌కు పింఛన్ మంజూరు చేయడం లేదని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని తల్లిదండ్రులు పోచంపల్లి లావణ్య-గంగాధర్ ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. లావణ్య- గంగాధర్ దంపతులు రజక వృత్తిలో కొనసాగుతూ కుటుంబాన్ని సాకుతున్నారు. చాలీచాలని కూలీతో కాలం వెల్లదీస్తున్నారు. దివ్యాంగుడైన కొడుకు యశ్వంత్‌కు సదరం ధ్రువీకరణ పత్రం ఉన్నా ప్రభుత్వం, అధికారులు పింఛను అందించడం లేదని వాపోతున్నారు. పలుమార్లు అధికారుల చుట్టు తిరిగినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన చెందుతున్నారు. కన్న కొడుకు పోషణ భారంగా మారుతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారలు స్పందించి ఫింఛన్ మంజూరు చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి ఐఎంఏ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

వేములవాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుండి వేములవాడలో క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారు. ఐఎంఏ ఆర్పీఎల్ టోర్నమెంట్ పేరిట నిర్వహించనున్న ఈ పోటీల్లో వైద్యులు, పోలీసులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి జట్లను ఏర్పాటు చేశామని ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగమల్ల శ్రీనివాస్, డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ తెలిపారు. సోమవారం నుంచి ఏప్రిల్ ఆరో తేదీ వరకు నిర్వహించనున్న ఈ పోటీల్లో ఆయా జట్లను రెండు గ్రూపులుగా విభజించి ఉదయం సాయంత్రం మ్యాచులు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. తొలిరోజు 31వ తేదీ సోమవారం ఉదయం ప్రారంభ మ్యాచ్‌లో డాక్టర్ల జట్టు న్యాయవాదుల జట్టుతో తలపడుతుందని, సాయంత్రం రెండో మ్యాచ్‌లో ఉపాధ్యాయుల జట్టు జర్నలిస్టుల జట్టుతో తలపడుతుందని వారు వివరించారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన నాయకులు


బండి సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

గంభీరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల బీజేపీ నేతలు ఆదివారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసారు. ఉగాది పండగను పురష్కరించుకుని బండి సంజయ్‌ను కరీంనగర్‌లో కలిసి ఉగాది పండగ శుభాకాంక్షలు తెలిపారు. బండి సంజయ్‌ను కలిసిన వారిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దోమకొండ కృష్ణకాంత్‌యాదవ్, పార్టీ నాయకులు మహేష్, సర్వోత్తమ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ముస్లింలకు నిత్యావసర సరుకులు అందజేత


నిత్యావసర వస్తువులను అందజేస్తున్న నాయకులు

గంభీరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలో సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పేద ముస్లింలకు రంజాన్ పండగను పురష్కరించుకుని నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అద్యక్షుడు హమీద్ మాట్లాడుతూ గత 15 ఏళ్ళ నుండి సిద్దిపేట ఫౌండేషన్ వారు స్థానిక పేద ముస్లీం ప్రజలకు కిట్లను పంపిణి చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కిట్లతో పేద ముస్లీంలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొంటూ సిద్దిపేట ఫౌండేషన్ వారికి ఈ సందర్బంగా ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామ మజీద్ కమిటీ అద్యక్షుడు మహబూబ్‌అలీ, మాజీ అద్యక్షుడు సయ్యద్ ఆసిఫ్‌అలీ సాదత్, మాజీ వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మెన్ అస్లాం, ముస్లీం మైనార్టీ నాయకులు జుబేర్, నుసరత్, వాసీమ్, ముస్తాఫ, షబాజ్ తదితరులు ఉన్నారు.

గోవిందరాజ స్వామి ఆలయంలో విప్ పూజలు


పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, మార్చి 30 (ఆంధ్ర జ్యోతి) చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని గోవిందరాజస్వామి ఆలయంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది(ఉగాది) సందర్భంగా తమ ఇంటి ఇలవేల్పు అయిన గోవిందస్వామిని దర్శించుకుని విప్ పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


నిమ్మపల్లిలో వాలీబాల్ కిట్ అందజేస్తున్న భూమేష్

కోనరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నాగండ్ల భూమేష్ అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేసి మాట్లాడారు. వేసవిలో క్రీడలపై యువత దృష్టి పెట్టాలని అన్నారు. మద్యానికి బానిస కాకుండా చదువుపై క్రీడల్లో దృష్టిపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో దార రవి, నరేష్, తిరుపతి, మహేష్, మధు తదితరులు ఉన్నారు.

చీరల పంపిణీ


చీరలనుపంపిణీ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 8వవార్డు పెద్దూర్‌లో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ కౌన్సిలర్ చెన్నమనేని కర్తీకమలాకర్ రావు అధ్వర్యంలో మహిళలందరికి చీరలను అందించిగా వాటిని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మల స్వరూప తిరుపతి రెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలందరు నూతన సంవత్సరంలో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్నమనేని కమలాకర్‌రావు, వెల్మల తిరుపతిరెడ్డి, పెద్దూర్‌మాజీ సర్పంచ్ ర్యాకం రమేష్, ఉలిశే నారాయణ, మహిళలు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


పోరుగర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏప్రిల్ రెండో తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న బీసీల పోరుగర్జన పోస్టర్‌ను ఆదివారం ఆయన వేములవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన నిర్వహించి బీసీల రిజర్వేషన్ల పెంపుపై ముందడుగు వేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన ద్వారా బీసీల జనాభా 56.37 శాతం ఉందని లెక్క తేలిందని తెలిపారు. దేశవ్యాప్తంగా దేశ సంపద అన్నివర్గాల ప్రజలకు అందాలనే దృఢ సంకల్పంతో రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర నిర్వహించారని, అనాడు ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలపడం జరిగిందని ఇట్లాంటి చారిత్రాత్మక సమయంలో అందులో భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల లెక్క తేల్చడానికి సిద్ధంగా లేదని, రాష్ట్రాలు చేసిన లెక్కలకు ఆమోదం తెలుపదని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బీసీల చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2న ఢిల్లీలో జరిగే బీసీల పోరు గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు రంజాన్

- ఈద్ ప్రార్థనలకు సిద్ధమైన ముస్లింలు

సిరిసిల్ల మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భక్తి విశ్వాసాలు, ఉపవాస దీక్షలు, జకాత్, ఫిత్రా వంటి దానధర్మాలకు ప్రతీకగా భావించే ఈదుల్ ఫితర్ (రంజాన్)ను సోమవారం ముస్లింలు జరుపుకోనున్నారు. ఆదివారం రాత్రి నమాజుల అనంతరం నెలవంక కనిపించడంతో రంజాన్ మాస ముగింపు సూచకంగా భావించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల రోజుల దీక్ష ముగించి మరుసటి రోజు ప్రత్యేక నమాజ్ సామూహికంగా చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటారు. మాసమంతా ఖురాన్ పఠనంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు చిన్నా పెద్దా తేడా లేకుండా అల్లాహ్‌పై తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

● నెలవంక దర్శనంతో నెలకొన్న సందడి

నెలవంక దర్శనమిచ్చింది. మసీదులు, ముస్లింల గృహల్లో సందడి నెలకొంది. ముస్లింల ముఖాల్లో ఆనందోత్సాహాలు కనిపించాయి. ఆదివారం రాత్రి నమాజుల అనంతరం నెలవంక కనిపించడంతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసం ముగింపు సూచకంగా భావించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలింగనాలు చేసుకున్నారు.

● ఈద్గాల్లో ఏర్పాట్లు

రంజాన్ సందర్బంగా పలు ఈద్గాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం సామూహిక ప్రార్థల దృష్ట్యా మున్సిపల్, పోలీసు, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. షామియానాలు, టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు.

గత పాలకవర్గంపై నిందలు వేయడం సరికాదు

- బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి


సమావశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి

సిరిసిల్ల టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గత మున్సిపల్ పాలకవర్గంపై కాంగ్రెస్ నాయకులు నిందలు వేయడం మానుకోవాలని, సిరిసిల్ల ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే నమ్మే పరిస్థితుల్లో వారు లేరని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో చక్రపాణి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, నాయకులు విలేకరులు సమావే శంలో మున్సిపల్ గత పాలకవర్గంపై చేసిన విమర్శలను ఖండించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించే కాంట్రాక్టు పనులపై అనుభవం ఉన్నవారు గత పాలకవర్గంలో కౌన్సిలర్లుగా పనిచేసిన వారు కాంట్రాక్టు పనులు టెండర్లపై తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. గత పాలక వర్గం అధికారంలోకి రాగానే రెండు సంవత్సరాలు కరోనా, తరువాత ఎన్నికలు రావడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొవల్సి వచ్చిందన్నారు. మున్సిపల్‌లో ఎప్పుడు అవినీతి జరిగిందని ప్రశ్నించారు. టెండర్లు పెట్టకుండా ఏ రకంగా బిల్లులు తీసుకుంటారని ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే నమ్మే పరిస్థితులలో లేరని అన్నారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇక్కడ కాంగ్రెస్ నాయకులు అబద్దాలు చెప్పుకుంటూ సంవత్సర కాలం గడపారని ఆరోపించారు. నాటి మంత్రి కేటీఆర్ రూ. 40 కోట్లు, రూ. 15 కోట్లు అభివృద్ధి పనులకు జీవో ఇచ్చారన్నారు. ఎన్నికల ముందు టెండర్లు పిలిచారని పార్టీలకు అతీతంగా అన్ని వార్డులకు దాదాపు రెండు కోట్లు పనులతో టెండర్లు ఇచ్చారన్నారు. రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ పనులను నిలిపివేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు సిరిసిల్ల పట్టణ అభివృద్ధి కోరుకునే వారే అయితే ఆ టెండర్లకు సంబంధించిన అభివృద్ధి పనులు చేయించాలని డిమాండ్ చేశారు. గత మున్సిపల్ పాలకవర్గంపై అనవసరమైన నిందలు వేయడం కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని హెచ్చరించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించే దహన సంస్కారాలపై అవినీతి జరిగిందని కొందరు కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌కు పిర్యాదు చేసి అందులో పనిచేసే సుంకరులకు మూడు నెలలుగా జీతాలు లేకుండా చేశారని ఆరోపించారు. రేపోమాపో అక్కడ పనిచేసే సుంకరలు పని మానేస్తే దానికి వారే బాధ్యులు అవుతారని హెచ్చరించారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు కల్లూరి రాజు, అన్నారం శ్రీనివాస్, లింగంపల్లి సత్యనారాయణ, దార్ల సందీప్, రిక్కుమల్లె సంపత్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మ్యాన రవి, సబ్బని హరీష్, గడ్డం భాస్కర్, బండారి శ్యాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కేసుల విషయంలో కాంగ్రెస్ యూటర్న్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ కేసుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని తన నివాసంలో ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని తల్లితో కలిసి ఆదివారం వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కేసులపై కాగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును పూర్తిగా నీరు గారుస్తున్నారన్నారు. శ్రవణ్‌రావుకు బెయిల్ వచ్చేలా చేసి కాంగ్రెస్ సహకరిస్తుందని విమర్శించారు. గత ఎన్నికల ముందు కేసీఆర్‌ను జైల్లో వేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి సర్కార్ యూటర్న్ తీసుకుందన్నారు. కాంగ్రెస్ పాలనను చూస్తే జ్యోతిష్య పండితులు చెప్పేది నిజమేననిస్తోందన్నారు. ఏడాదిగా దొంగతనాలు ఎక్కువై పోయాయని, ప్రజాప్రతినిధులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ శాఖలో చూసినా అవినీతి రాజ్యమేలుతోందన్నారు. కాంగ్రెస్ నేతలకు కరప్షన్ వైరస్ సోకిందన్నారు. కాంట్రాక్టర్ల దగ్గర నుంచి పెండింగ్ బిల్లుల వరకు ప్రతి దాంట్లోనూ కమీషన్లు ఇవ్వనిదే పని జరగడం లేదన్నారు.

రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీని స్వాగతిస్తున్నామని, బియ్యం ఖర్చంతా కేంద్రమే భరిస్తుందన్నారు. ఒక్కో కిలోకు మోదీ ప్రభుత్వం 40 రూపాయలు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై పది రూపాయలు మాత్రమే పడుతుందన్నారు. ప్రజల దృష్టిని దారి మళ్లించడానికి డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతున్నారన్నారు. దేశాన్ని విభజిస్తామంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడుత దేశద్రోహానికి పాల్పడుతున్నారన్నారు. ఆర్ఎస్ఎస్ దేశభక్తి కలిగిన సంస్థ అని దేశం ధర్మం, సనాతన ధర్మం, హిందు సమాజం సంఘటితం చేసేందుకు నిరంతరం కృషి చేస్తు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఒవైసీ ఆసుపత్రిలో ఉగ్రవాదులు దొరికారన్నారు. దారుస్సలాం టెర్రరిస్టులకు అడ్డాగా మారిందన్నారు. అధికారంలో ఏ పార్టీఉంటే ఆ పార్టీకి అమ్ముడుపోయే పార్టీ మజ్లిస్ అని విమర్శించారు. సమావేశంలో మాజీ మేయర్ సునీల్‌రావు, వాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.